### కేటీఆర్ పర్యటనతోనే నీటి విడుదల

గంగాధర, జూలై 28 : రైతు సంక్షేమం కోసం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు, నాయకుల పర్యటనతోనే కాంగ్రెస్ సర్కారు రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రీ పంపుహౌస్ నుంచి వరద కాలువకు నీటిని విడుదల చేసిందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. వందలాది క్యూసెక్కుల నీరు వృథాగా సముద్రంలో కలుస్తున్నా కాంగ్రెస్ పాలకులు నిర్లక్ష్యం చేశారని దుయ్యబట్టారు. రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేటీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించి నీటిని విడుదల చేయాలని ప్రభుత్వానికి డెడ్ లైన్ విధించారని గుర్తు చేశారు. కేటీఆర్ అల్టిమేటంతో దిగివచ్చిన సర్కారు వరదకాలువకు నీటిని విడుదల చేసినట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ పోరాటంతోనే చొప్పదండి నియోజకవర్గంలోని వరదకాలువలో గోదావరి జలాలు పరవళ్లు తొక్కినట్లు తెలిపారు. రైతు సంక్షేమాన్ని కోరేది బీఆర్ఎస్ అని, రైతులను గోసపెడుతున్నది కాంగ్రెస్ ప్రభుత్వమని పేర్కొన్నారు.

### ప్రధానోపాధ్యాయుడికి ఉద్యోగ విరమణ సన్మానం

సత్యనారాయణను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కమాన్‌చౌరస్తా, జూలై 28 : ఉపాధ్యాయ వృత్తి కొనసాగించి ఉద్యోగ విరమణ పొందిన కరీంనగర్ జిల్లా పోపా అధ్యక్షుడు, గంగాధర మండలం న్యాలకొండపల్లి మండల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ పోలు సత్యనారాయణ ఉద్యోగ విరమణ కార్యక్రమం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీవో కుందారపు ఉమామహేశ్వర్ హాజరై, ఉద్యోగ విరమణ పొందిన పోలు సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాళేశ్వరం ప్రాజెక్ట్ చీఫ్ ఇంజినీర్ నల్ల వెంకటేశ్వర్లు, ట్రాన్స్‌కో ఎస్ఈ వడ్లకొండ గంగాధర్, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రీజినల్ కోఆర్డినేటర్ ఆడపు శ్రీనివాస్, సిరిసిల్ల డీపీవో వీర బుచ్చయ్య, మెట్‌పల్లి ఆర్డీవో నక్క శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షుడు మామిడాల సురేందర్, కరీంనగర్ జిల్లా పోపా ప్రధాన కార్యదర్శి డాక్టర్ యెలిగేటి మల్లికార్జున్, పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు మెతుకు సత్యం తదితరులు పాల్గొన్నారు.

### చిగురుమామిడి మండల వాసికి డాక్టరేట్

హైదరాబాద్‌లో డాక్టరేట్‌ను స్వీకరిస్తున్న ఐలయ్య

చిగురుమామిడి, జూలై 28: మండల కేంద్రానికి చెందిన కరాటే మాస్టర్ బొల్లి ఐలయ్య ఏషియా వేదిక్ రీసెర్చ్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అవార్డు అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో శ్రీ రామకృష్ణవేణి సేవా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ కొత్వాల్ దయానంద్, ఏషియా వేదిక్ రీసెర్చ్ యూనివర్సిటీ ప్రతినిధి మార్గరెట్ అమూల్ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఐలయ్య 20 సంవత్సరాలుగా కరాటేలో వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంతోపాటు అనేక మందిని కరాటే మాస్టర్లుగా తీర్చిదిద్దారు. దీనికితోడు జిల్లాలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ క్రమంలో ఆయనను గౌరవ డాక్టరేట్‌కు ఎంపిక చేశారు. కాగా, ఐలయ్య డాక్టరేట్ అందుకున్న సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు వొడితల సతీశ్ కుమార్, చాడ వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ కొత్త వినీతా శ్రీనివాస్ రెడ్డి, డార్విన్ స్కూల్ కరస్పాండెంట్ సమ్మిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

### పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గం

నూతనంగా ఎన్నికైన మండల పద్మశాలీ సంఘం కార్యవర్గ సభ్యులు

శంకరపట్నం, జూలై 28: మండల కేంద్రంలోని మాధవసాయి గార్డెన్‌లో ఆదివారం పద్మశాలీ సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల కన్వీనర్ గాజుల శ్రీనివాస్ పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు. పద్మశాలీ సంఘం నూతన మండలాధ్యక్షుడిగా వంగ భిక్షపతి, ఉపాధ్యక్షులుగా ఒడ్డేపల్లి ఓంపతి, ఆకుపబత్ని విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా వొడ్నాల వీరస్వామి, కోశాధికారిగా తాటిపాముల తిరుపతయ్య, సహాయ కార్యదర్శిగా గాజుల నాగరాజు, కార్యవర్గ సభ్యులుగా సామల మార్కండేయ, బైరి సుధాకర్, వంగ జనార్ధన్, ఉషకోయిల సంపత్, వంగ తిరుపతి ఎన్నికయ్యారు. సమావేశంలో మండల మాజీ గౌరవాధ్యక్షుడు అధ్యక్షుడు హనుమంతు, మాజీ కోశాధికారి వంగ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### గ్రానైట్ కార్మికులకు వైద్య పరీక్షలు


కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న మెడికవర్ వైద్యులు

గంగాధర, జూలై 28 : మండలంలోని ఒద్యారం శ్రీ వెంకటేశ్ గ్రానైట్స్‌లో ఆదివారం కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రానైట్ క్వారీల్లో పని చేస్తున్న కార్మికులు 200 మందికి బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో, పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, జనరల్ ఫిజీషియన్ కార్తీక్, కార్డియాలజిస్ట్ పబ్బ అనిల్, క్వారీ నిర్వాహకుడు కార్తీక్, మార్కెటింగ్ మేనేజర్ తోట కర్ణ, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### 'మన్ కీ బాత్ విజయవంతం'

చిగురుమామిడి, జూలై 28: మండలంలోని 17 గ్రామాల్లో 36 బూత్‌లకు సంబంధించిన నాయకులు ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారని బీజేపీ మండలాధ్యక్షుడు పైడిపల్లి శ్రీనివాస్ తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రముఖ్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించగా, 350 మంది వీక్షించారని చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కార్యకర్తలకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

### బస్టాండ్ ఇలా.. ప్రయాణం ఎలా..!?

బురదమయంగా మారిన కేశవపట్నం ఆర్టీసీ బస్టాండ్

శంకరపట్నం, జూలై 28: కేశవపట్నం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు బురదనీటిమయమైంది. ఇటీవల గ్రామ పంచాయతీ అధికారులు మొరం పోసినా పూర్తిగా చదును కాలేదు. ఆర్టీసీ అధికారులు పూర్తి స్థాయిలో మొరం నింపి చదును చేయకపోవడంతో బస్సులు నిలిచే స్థలంలోనే నీరు నిలిచి బురదగా మారుతున్నది. ప్రయాణికులు బురద నీటిలో నుంచే బస్సులోకి వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్ ఆవరణను మెరుగు పరిచి ఇక్కట్లు తొలగించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

# స్వార్థపరుల పాపం.. ఆ ఊరి ప్రజలకు శాపం!

దేశరాజ్‌పల్లి నుంచి వెలిచాలకు వెళ్లే దారిలో ప్రశాంత్ భవన్ సమీపంలో శిథిలావస్థకు చేరిన వంతెన

కొందరు స్వార్థపరులు చేసిన పాపాలు ఆ గ్రామ ప్రజలకు శాపాలుగా మారి చివరకు ఆ ఊరికి వెళ్లేందుకు దారులే లేకుండా మూసుకుపోతున్నాయి. నాలుగు కాలాల పాటు ప్రజలకు ఉపయోగపడాల్సిన వంతెనలు, నిర్మించిన నాలుగేళ్లలోపే నాణ్యతాలోపం కారణంగా దెబ్బతిన్నాయి. రూ. కోట్లు వెచ్చించి చేపట్టిన వంతెనలపై గుంతలు పడడం.. ఇరువైపులా కుంగుతుండడం.. అప్రోచ్ రోడ్లు సరిగా లేకపోవడంతో ప్రయాణికులు భయాందోళనలతో బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

*-రామడుగు, జూలై 28*

- నాటి ప్రజాప్రతినిధి నిర్వాకంతో శిథిలావస్థకు వారధులు
- కమీషన్ల కక్కుర్తి, అధికారుల వైఫల్యంతో అస్తవ్యస్తం
- సరైన ప్రణాళికలు లేకుండా వంతెనల నిర్మాణం
- రూ.కోట్లు వెచ్చించినా నిరుపయోగమైన వెలిచాల దారి

కొత్తపల్లి నుంచి వెలిచాలకు వెళ్లే దారిలో దెబ్బతిన్న వంతెన

రామడుగు మండలం వెలిచాల గ్రామం జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉంటుంది. మండలంలో పెద్ద గ్రామ పంచాయతీ కాగా, రెండు దఫాలుగా ఉత్తమ గ్రామ పంచాయతీగా దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన అవార్డులను కైవసం చేసుకొంది. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో వెలిచాలను జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌తోపాటు అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ కృషి మరువరానిది. వెలిచాల గ్రామాన్ని జిల్లాకే తలమాణికంగా నిలిచేలా కేసీఆర్ ప్రభుత్వం చేయూతనందించింది. వెలిచాల గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రామడుగు సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర రావు రెండు వంతెనల నిర్మాణానికి నిధులు తెచ్చారు. నాటి టీఆర్ఎస్ ఎమ్మెల్యే బొడిగ శోభ 2017 జనవరిలో శిలాఫలకాలు ఆవిష్కరించి పనులు ప్రారంభించారు. కొత్తపల్లి నుంచి వెలిచాలకు వెళ్లేదారిలో కావేరీ జిన్నింగ్ మిల్ సమీపంలో రూ.కోటీ 11లక్షలతో ఒక వంతెన, దేశరాజ్‌పల్లి నుంచి వెలిచాలకు వెళ్లే దారిలో ప్రశాంత్ భవన్ సమీపంలో రూ.90 లక్షలతో మరొక వంతెన నిర్మాణం చేపట్టారు. గ్రామానికి చెందిన నాటి ఒక ప్రజాప్రతినిధి గుత్తేదారుతో కుమ్మక్కై నాసిరకంగా వంతెనల పనులు పూర్తిచేసిమమ అనిపించడంతో కొంత కాలానికే వాటిపై గుంతలుపడి శిథిలావస్థకు చేరుకొన్నాయి. సదరు ప్రజాప్రతినిధి రెండు వంతెనల నిర్మాణ సమయంలో సలాకతో పాటు కంకర, ఇతర సామగ్రిని కూడా తరలించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో కాంట్రాక్టర్ ఏం చేయాలో తోచక ఉన్నదానితో సరిపెట్టి వంతెనల నిర్మాణం పూర్తి చేసినట్లు చెబుతున్నారు.

**నాసిరకం పనులతోనే కుంగిపోతున్నది..**

నేను సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత వంతెనలకు ఇరువైపులా కుంగిపోవడాన్ని 2021లో గుర్తించాం. భారీ వర్షాల కారణంగా కొత్తపల్లి–వెలిచాల వంతెనకు ఇరువైపులా రోడ్డు కుంగిపోవడంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టాం. అనంతరం వచ్చిన వర్షాకాలంలో మళ్లీ కుంగిపోవడంతో వంతెనకు ఇరువైపులా సలాక, కంకర, సిమెంట్‌తో కొంత పటిష్టంగా మరమ్మతులు చేశాం. అయినా అనంతరం వచ్చిన వానకాలంలో మళ్లీ కుంగిపోయింది. దీనిపై అధికారులను సంప్రదించగా వంతెనల నిర్మాణ సమయంలోనే ఇరువైపులా మట్టితో రోలింగ్ చేయాల్సి ఉంటుందని, అది చేయకపోవడంతో పదేపదే కుంగిపోతున్నదని చెప్పారు. దీనికి శాశ్వత పరిష్కారం చేపట్టి వంతెనకు ఇరువైపులా కుంగిపోకుండా అధికారులు చర్యలు చేపట్టాలి.

**– వీర్ల సరోజన, మాజీ సర్పంచ్, వెలిచాల**

**మరమ్మతులు చేసినా ఫలితం శూన్యం**

నిర్మాణ సమయంలో రెండు వంతెనలకు ఇరువైపులా సరిగా రోలింగ్ చేయకుండా పూర్తిచేయడంతో ఎన్నిసార్లు మరమ్మతులు చేపట్టినా మళ్లీ కుంగిపోయి గుంతలు పడుతుండడంతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. సరైన ప్రణాళికలు లేకుండా వంతెనల నిర్మాణం చేపట్టగా, ఇరువైపులా అప్రోచ్ రోడ్డు సరిగా వేయకపోవడంతో చిన్న వాహనాలపై వెళ్లేందుకు కూడా అపసోపాలు పడాల్సి వస్తున్నదని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వంతెనల చివరలో అప్రోచ్‌రోడ్డు వేసి గోడలు నిర్మించకపోవడంతో వరద తాకిడికి మట్టి కొట్టుకుపోయి రోడ్డు కుంగిపోతున్నది. వంతెనకు ఇరువైపులా స్లాబ్‌ను ముందుకు తీసుకెళ్లకుండా అకస్మాత్తుగా దించడంతో వంతెన ఇరువైపులా కుంగిపోతున్నది. కొంత కాలంగా భారీగా వర్షాలు కురుస్తుండడంతో వరద ప్రవాహం పెరిగి వంతెనకు ఇరువైపులా కోతకు గురవుతున్నది. నాటి ఓ ప్రజాప్రతినిధి తన స్వార్థం కోసం వంతెనల నిర్మాణంలో తలదూర్చి కమీషన్లకు కక్కుర్తి పడడంతోనే పనులు నాసిరకంగా చేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు. నిజానికి వంతెన నాలుగు కాలాలపాటు ప్రజలకు ఉపయోగ పడేలా నిర్మించాల్సిందిపోయి, నాలుగు డబ్బులు వెనుకేసుకోవాలనే స్వార్థపూరిత ఆలోచన అభివృద్ధికి ఆటంకంగా నిలుస్తున్నదని ప్రయాణికులు వాపోతున్నారు.

### వివాహం కాదేమోనని యువతి ఆత్మహత్య

రాంనగర్, జూలై 28: నగరంలోని బోయవాడకు చెందిన యువతి కుటుంబంలోని ఆర్థిక ఇబ్బందులతో తనకు వివాహం జరుగదేమోనని మనస్తాపానికి గురై ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోయవాడకు చెందిన కొవ్వూరి ధరణి(22) ఇంటర్ వరకు చదివి ఇంటి వద్ద ఉంటున్నది. మూడు నెలల క్రితం జగిత్యాల జిల్లా రాయికల్‌కు చెందిన యువకుడితో ధరణికి తల్లి మాలతి వివాహం నిశ్చయం చేసింది. పెళ్లి ఖర్చులకోసం డబ్బులు అవసరం కావడంతో పెద్దపల్లిలో ఉంటున్న బంధువుల దగ్గరికి కొడుకు సాయిని తీసుకొని శనివారం ఉదయం వెళ్లింది. ఇంట్లో మాలతి ఒకతే ఉండడంతో సాయంత్రం పెద్దపల్లికి వెళ్లిన తల్లి మాలతి ఫోన్ చేయగా ఎత్తకపోవడంతో అనుమానం వచ్చి సమీపంలో ఉంటున్న కూతురు స్నేహితురాలికి ఫోన్ చేసి ఇంటికి వెళ్లమని చెప్పింది. ఇంటికి వెళ్లిన ఆమెకు ధరణి ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించడంతో ఫోన్ చేసి మాలతికి విషయం చెప్పింది. సమీపంలో ఉన్న యువకుల సాయంతో కిందికి దింపి ప్రభుత్వ దవాఖానకు తరలించగా, డాక్టర్లు పరీక్షించి ధరణి మృతి చెందినట్లు చెప్పారు. పెద్దపల్లి నుంచి కొడుకుతో కలిసి దవాఖానకు చేరుకున్న మాలతి, పోలీసులకు సమాచారం అందించగా, వారు అక్కడికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మాలతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ సరిలాల్ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రాంనగర్, జూలై 28: నగరంలోని తీగల వంతెన వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంభీరావుపేట మండలం లింగన్నపేటకు చెందిన దొంతినేని అభినయ్ (24) రెనాల్ట్ షోరూంలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి బైపాస్ దారిలో ఉన్న హోటల్‌లో భోజనం చేసేందుకు వెళ్తుండగా వర్షం పడడంతో బైక్ అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లి సెంట్రల్ లైటింగ్ పోల్‌కు ఢీకొనగా తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక పెట్రోల్ బంక్ వర్కర్లు చూసి పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకున్న పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని ప్రభుత్వ దవాఖానకు తరలించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. యువకుడి తల్లి శైలజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సరిలాల్ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో ఇందుర్తి వాసులకు తీవ్రగాయాలు

చిగురుమామిడి, జూలై 28: ఇందుర్తి గ్రామానికి చెందిన భీమర రమేశ్–గౌతమి దంపతులు, వారి కుమారుడు హిమాన్షు ఆదివారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ సమ్మక్క కార్నర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యారు. హనుమకొండకు వెళ్లేందుకు ముగ్గురు ద్విచక్ర వాహనంపై గ్రామం నుంచి బయలుదేరారు. ముల్కనూర్ సమ్మక్క కార్నర్ వద్ద మూత్ర విసర్జనకు వెళ్లి ద్విచక్రవాహనం వద్దకు వస్తున్న క్రమంలో హనుమకొండ వైపు వెళ్తున్న పాల వ్యాను వేగంగా వచ్చి ఢీకొన్నది. ఈ ప్రమాదంలో హిమాన్షుకు తీవ్రగాయాలు కాగా, గౌతమి, రమేశ్‌కు కాళ్లు చేతులు విరిగిపోయాయి. స్థానికులు వారిని 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. ప్రస్తుతం హిమాన్షు అపస్మారక స్థితిలో ఉన్నాడు.

### ఆన్‌లైన్ గేమ్ యువకుడి ప్రాణం తీసింది

హుజూరాబాద్ రూరల్, జూలై 28: ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడి అప్పులపాలైన బీటెక్ విద్యార్థి రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని రాంపూర్ గ్రామంలో విషాదాన్ని నింపింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఏనుగు ఎల్లారెడ్డి–విజయ దంపతుల ఏకైక కుమారుడు వాసురెడ్డి(20) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. గతంలో ఆన్‌లైన్‌లో బెట్టింగ్ కోసం రూ.2 లక్షలు అప్పుచేయగా ఇంట్లో పెద్దలు చెల్లించారు. మరోసారి అదే బెట్టింగ్ చేస్తూ అప్పులపాలయ్యాడు. ఈ క్రమంలో తల్లిదండ్రులు తిడుతారేమోననే మనస్తాపం చెంది శనివారం జనగామలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు దూరమవడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

### మహిళా చట్టాలను కఠినంగా అమలు చేయాలి

తెలంగాణచౌక్, జూలై 28: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా చట్టాలను కఠినంగా అమలు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి డిమాండ్ చేశారు. నగరంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతుల్లో మూడో రోజు ఆదివారం సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఐద్వా ఆధ్వర్యంలో మహిళలను చైతన్యపరుచడానికి సభలు, సమావేశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాళ్లు సరళ, రత్నమాల, ప్రభావతి, జిల్లా కార్యదర్శి కోనేటి నాగమణి, ఉపాధ్యక్షురాలు అన్నపూర్ణ, లావణ్య, రజిత పాల్గొన్నారు.

### స్నేహితుల ఔదార్యం

చొప్పదండి, జూలై 28 : మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన పులి అంజయ్య గౌడ్ గత నెలలో దుబాయ్‌లోని రియాద్‌లో మరణించగా, బాధిత కుటుంబానికి మృతుడి చిన్ననాటి మిత్ర బృందం, 1991–92 ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు రూ. 53,580 ఆర్థిక సాయం అందజేశారు. ఇక్కడ నాయకులు మునిగాల సుధాకర్ గౌడ్, మిత్ర బృందం ఆరెల్లి చంద్ర శేఖర్ గౌడ్, పచ్చునూరి తిరుపతి, మునిగాల రవీందర్, తాటిపెల్లి శివ, మాచర్ల ఆశీర్వాదం, సామల తిరుపతి, దేవసాని మార్కండేయ, శాఖ్లల్ల నరేంద్రాచారి తదితరులున్నారు.

### 'ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే రాష్ట్ర బడ్జెట్'

తెలంగాణచౌక్, జూలై 28: రాష్ట్ర బడ్జెట్ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా ఉందని 9వ డివిజన్ మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ నాయకుడు పడిశెట్టి(టేల) భూమయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.2.91 లక్షల కోట్ల బడ్జెట్‌లో అధిక నిధులను ప్రాధాన్యత రంగాలకు కేటాయించినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేసిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ధన్యవాదాలు తెలిపారు.

### చెల్పూర్ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది బదిలీ

హుజూరాబాద్ రూరల్, జూలై 28: మండలంలోని చెల్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది తొమ్మిది మందిని ఒకేసారి బదిలీ చేశారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఆదివారం బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. బదిలీ అయిన వారిలో రెండో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్యామ్ ప్రసాద్, ఫార్మసిస్టు బాపు రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్–గ్రేడ్2 చిన్నబాబు, హెల్త్ సూపర్ వైజర్లు రమేశ్, చంద్రలీల, సింగాపూర్, ఇప్పల్ నర్సింగాపూర్, పెద్దపాపయ్యపల్లి ఏఎన్ఎంలు రాణి, వజ్రమ్మ, విజయలక్ష్మి, ఆఫీస్ సబార్డినేట్ రాజేందర్ ఉన్నారు.

### బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

తెలంగాణచౌక్, జూలై 28: బ్రాహ్మణ పరిషత్‌ను కార్పొరేషన్‌గా మార్చి రూ.500 కోట్లు కేటాయించాలని భారతీయ బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రీరాంభట్ల దీపక్‌బాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో నిధులే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం బ్రాహ్మణ పరిషత్‌కు నిధులు కేటాయించ పోవడం బాధాకరమన్నారు. సమావేశంలో రామారావు, రవీందర్‌రావు, వసంతరావు పాల్గొన్నారు.

### ఎస్టీ రిజర్వేషన్లు పెంచాలి

తెలంగాణచౌక్, జూలై 28: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్టీ రిజర్వేషన్లు పెంచాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ ఆదివారం ఒక ప్రకటనలో కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి, కరీంనగర్ అర్బన్ మండలాల్లో ఎస్టీలకు మూడు సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలతో పాటు ఒక జడ్పీ సీట్ కేటాయించాలని కోరారు. నగరపాలక సంస్థలో కూడా మూడు డివిజన్లు కేటాయించి ఎస్టీలకు రాజకీయ అవకాశాలను కల్పించాలని కోరారు.

### ఏఎంసీ పాలకవర్గ సభ్యులకు సన్మానం

చొప్పదండి, జూలై 28: చొప్పదండి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులను కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండలాధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మార్కెట్ చైర్మన్ కొత్తూరు మహేశ్, వైస్ చైర్మన్ మునిగాల రాజేందర్, మార్కెట్ డైరెక్టర్లు చుప్ప శ్రీనివాస్, జక్కుల అనిల్ కుమార్, ఈర్ల స్వామి, పెరుమాండ్ల రవీందర్, ఎల్లాల ఆదిరెడ్డి, గోస్కుల కొమురెల్లి, పత్తిపాక నరేశ్‌ను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు ముద్దం తిరుపతి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పురం రాజేశం, కౌన్సిలర్లు కొట్టె అశోక్, పెరుమాండ్ల గంగయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### 'నారాయణపూర్' కుడి కాలువకు గండి

గంగాధర, జూలై 28 : ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని నారాయణపూర్ రిజర్వాయర్ కుడి కాలువకు మధురానగర్ సమీపంలో గండి పడింది. దీంతో వరదనీరు సమీప పొలాల్లోకి చేరుతున్నది. అధికారులు స్పందించి గండిని పూడ్చి వేయాలని రైతులు కోరుతున్నారు.

### తల్లిపాలే శ్రేయస్కరం

కలెక్టరేట్, జూలై 28 : పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలు అత్యంత శ్రేయస్కరమని వైద్యురాలు శోభారాణి తెలిపారు. నగరంలోని సవరన్ స్ట్రీట్ సెక్టార్‌లో గల సాహెత్‌నగర్ క్లస్టర్ పరిధిలోని కార్ఖానాగడ్డ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాలపై అవగాహన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, చిన్నారులకు తల్లిపాల ద్వారా రోగ నిరోధక శక్తిని అందించవచ్చన్నారు. సమావేశంలో తల్లులు, గర్భిణులు, పిల్లలతో పాటు ఆరోగ్య పర్యవేక్షకురాలు లక్ష్మి, ఏఎన్ఎం రజిత, అంగన్‌వాడీ టీచర్లు నయామున్నీసా బేగం, సీహెచ్.రమ, జి.అంజలీదేవి, పద్మజ, పుష్పలత, ఆయాలు కళావతి, ఆశ, వినోద, రమ పాల్గొన్నారు.

### టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా కృష్ణ

తిమ్మాపూర్, జూలై 28: తెలంగాణ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా పోలంపల్లి గ్రామానికి చెందిన ఖమ్మం కృష్ణను రాష్ట్ర బాధ్యులు నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టీఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి కనకం రవి మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు జానయ్య, మీడియా ఇన్‌చార్జి ఇటుక గోపి, నేదునూర్ మాజీ సర్పంచ్ వడ్లూరి శంకర్, నాయకులు రాజవీరు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ఎస్సీ బాలుర హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలి

శంకరపట్నం, జూలై 28: కేశవపట్నం ఎస్సీ బాలుర హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఏఐఎస్ఎఫ్ నాయకులు కేశవపట్నం ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కనకం సాగర్ మాట్లాడారు. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు అవుతున్నా 60 మంది విద్యార్థులకు ఇంత వరకు నోట్‌బుక్స్, దుప్పట్లు, దోమ తెరలు, పరుపులు, స్టడీ మెటీరియల్, స్టడీ చైర్స్, షూ పంపిణీ కాలేదని తెలిపారు. విద్యార్థులు పాఠశాల ఆవరణలోని బురద నీటి గుండా లోనికి వస్తున్నారని, అయినా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. అలాగే పలు గదుల్లో వర్షం పడినప్పుడు నీరు లీకవుతున్నదని, ఆట వస్తువుల ఊసే లేదని దుయ్యబట్టారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో హాస్టల్ వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆది, సంతోష్, ఆకాశ్ తదితరులు పాల్గొన్నారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చిగురుమామిడి, జూలై 28: మండలంలోని చిగురుమామిడి, సుందరగిరి, బొమ్మనపల్లి, రేకొండ, నవాబ్ పేట్, కొండాపూర్, ముదిమాణిక్యం, ఒగులాపూర్ గ్రామాల్లో హుస్నాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఆదివారం 15 మంది లబ్ధిదారులకు రూ.2.97 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశామని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి దాసరి ప్రవీణ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టిమల్ల రవీందర్, మండల ఉపాధ్యక్షుడు ఠాకూర్ నరేందర్ సింగ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో 2000–21 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

వీణవంక, జూలై 28: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000–21 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగాడి రాజిరెడ్డి, కేదారేశ్వర్, సాంబయ్య, సుధాకర్, సత్తయ్య, రాజిరెడ్డి, పూర్వ విద్యార్థులు జమీల్, హసన్, అమృత ప్రభాకర్, రమేశ్, ముద్దెర శ్రీనివాస్, వోరెం పూర్ణచందర్, రవీందర్, దాసారపు అంకూస్, బబ్బూరి శ్రీనివాస్, రాము, మమత, శారద, సరిత, సుస్మిత, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

### ధర్మారంలో ఎన్పీడీసీఎల్ అధికారుల సర్వే

శంకరపట్నం, జూలై 28: మండలంలోని ధర్మారం గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఆదివారం ఎన్పీడీసీఎల్ అధికారులు సర్వే నిర్వహించారు. ఇటీవల ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద ధర్మారం గ్రామం ఎంపికైంది. ఈ మేరకు ఎన్పీడీసీఎల్ అధికారులు కాలనీలోని కరెంట్ పోల్స్ స్థితిగతులు, లూజ్ లైన్లు ఏమైనా ఉన్నాయా? అని పోల్ టూ పోల్ పరిశీలించారు. అలాగే కాలనీలో విద్యుత్ వినియోగం తీరు, సరిపడా లోడ్ ఉందా.. విద్యుత్ సరఫరాను మెరుగు పరిచేందుకు చేపట్టవలసిన చర్యలు, తదితర అంశాలపై అధికారులు, సిబ్బంది వినియోగదారులతో మాట్లాడి ఇంటింటి సర్వే నిర్వహించారు. సర్వేలో లైన్‌మెన్ శ్రీనివాస్, జేఎల్ఎం రమేశ్, హెల్పర్ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

### భారత జట్టు కాంస్య పతకం సాధించడంపై హర్షం

కొత్తపల్లి, జూలై 28 : పారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్‌లో భారత జట్టు టాప్ షూటర్ మను భాకర్ కాంస్య పతకం సాధించడం గర్వకారణమని రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, జిల్లా యోగా అసోసియేషన్ కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మహిళల షూటింగ్ విభాగంలో మొదటిసారి ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించడం చారిత్రాత్మకమన్నారు. అలాగే మిగతా క్రీడాంశాల్లో అద్భుత ప్రతిభ చూపి మరిన్ని పతకాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

## ఘనంగా పోచమ్మ బోనాలు

- పాల్గొన్న మేయర్, డిప్యూటీ మేయర్

బోనాల వేడుకలో పాల్గొన్న మేయర్ వై సునీల్ రావు

కమాన్‌చౌరస్తా, జూలై 28 : జిల్లా కేంద్రంలో పలు సంఘాలు, కాలనీల ఆధ్వర్యంలో ఆషాఢ మాసం చివరి ఆదివారం బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా, 26వ డివిజన్‌లో విజయదుర్గాదేవి బోనాల ఉత్సవంలో, 24వ డివిజన్‌లో కాళీమాత బోనాల జాతరలో నగర మేయర్ యాదగిరి సునీల్ రావు, కార్పొరేటర్లు నక్క పద్మా కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు ఎడ్ల అశోక్, కుర్ర తిరుపతి, జంగిల్ ఐలేందర్ యాదవ్ తదితరులతోపాటు కాలనీవాసులు పాల్గొని పూజలు చేశారు.

- ఎంఆర్ మున్నూరు కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కరీంనగర్ డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్, ఎంఆర్ మున్నూరు కాపు సంఘం గౌరవాధ్యక్షుడు రాజేందర్, అధ్యక్షుడు నాంచారి రాజయ్య, ప్రధాన కార్యదర్శి వేదంతం సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు చల్ల హరికృష్ణ, శ్రీరామ్ నరేందర్, కమిటీ సభ్యులు, కుల పెద్దలు, మున్నూరు కాపు మహిళలు పాల్గొని అమ్మవారికి బోనాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించారు.
- విద్యానగర్ కొత్తయాస్వాడలో పోచమ్మ ఆలయాన్ని తెలంగాణ ఫోక్ సింగర్ వొల్లాల వాణి తన సొంత ఖర్చులతో నిర్మించగా, బోనాల సందర్భంగా ఆమె తన కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడ ఉదయ్, ప్రణయ్, మిట్ట సౌమ్య, వొల్లాల వనజ తదితరులున్నారు.
- జ్యోతినగర్‌లోని సాధనా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో కరస్పాండెంట్ శ్రీనివాస్ రావు, ప్రిన్సిపాల్ కుమార స్వామి, హెచ్ఎం ధనలక్ష్మి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ఆటపాటలతో ఆకట్టుకున్నారు. పిల్లలు సంప్రదాయ వేషధారణలో హాజరై అమ్మవారికి బోనం సమర్పించారు.
- రాంచంద్రాపూర్ కాలనీలో రోడ్డు నంబర్‌లోని 21, 26వ కాలనీల్లో బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ వేణు దంపతులతో పాటు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వింధ్యావ్యాలీ పాఠశాలలో బోనాలతో విద్యార్థినులు

- కొత్తపల్లి, జూలై 28: జిల్లా కేంద్రంలోని మెహర్‌నగర్ వింధ్యావ్యాలీ ఉన్నత పాఠశాలలో పోచమ్మ బోనాల సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీ ప్రకాశ్ రావు పోచమ్మ తల్లికి జ్యోతి ప్రజ్వలన చేసి పూజను ప్రారంభించారు. విద్యార్థులు బోనాలు ఎత్తుకొని అమ్మవారు, పులి, పోతరాజుల వేషధారణలతో, డప్పుచప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. పోచమ్మ తల్లికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ రామవరం పృథ్వీరావు, ప్రిన్సిపాల్ జి. ప్రశాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ మేయర్